సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్‌నంబర్‌కు వాట్సాప్ చేయండి

91829 05602

నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

'ఫ్యామిలీ డాక్టర్'పై అందరికీ అవగాహన

మహారాణిపేట: ఫ్యామిలీ డాక్టర్ విధానంపై అందరికీ అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. విద్యుత్‌నగర్ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. అక్కడి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. యూపీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది అంతా సమయపాలన పాటించాలని, విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. బర్త్ ప్లానింగ్, హైరిస్క్ గర్భిణుల కోసం వైద్యులు సలహాలు ఇవ్వాలని, ఐరన్ ఫోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేలా ప్రోత్సహించాలని డీఎంహెచ్‌వో చెప్పారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'గ్రీవెన్స్'



ప్రజా వినతులు పరిశీలిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజుకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని ఆయన పరిశీలించి కొన్ని అర్జీలను తక్షణం పరిష్కరించారు. మిగిలిన వినతులను సంబంధిత అధికారులకు పంపి త్వరలోనే పరిష్కరిస్తామని కె.కె.రాజు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, పలువురు వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పూడిక తరలింపు



శంకువానిపాలెంలో పూడిక తరలించి బ్లీచింగ్ పౌడర్ చల్లిన ప్రదేశం

సాక్షి ఎఫెక్ట్..

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు శంకువానిపాలెం గెడ్డలోంచి తొలగించి రోడ్డు పక్కన కుప్పగా పోసిన పూడికను ఎట్టకేలకు పారిశుధ్య సిబ్బంది తరలించారు. వారం రోజులు గడిచినా పూడిక తరలించకపోవడంతో దుర్వాసనతో స్థానికులు పడుతున్న ఇబ్బందిపై 'పూడిక తరలించండి' అనే శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి జీవీఎంసీ అధికారులు తక్షణం స్పందించారు. వారి ఆదేశాలతో సిబ్బంది హుటాహుటిన లారీతో పూడిక తరలించి దుర్వాసన రాకుండా ఆ ప్రదేశంలో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. సమస్య పరిష్కారమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కలియుగ వెంకన్నకు విశేష పూజలు



ప్రత్యేక పూజల్లో అర్చకులు, భక్తులు

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగన్నాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అర్చనలు, పంచామృతాభిషేకాలు చేశారు. పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్న స్వామికి ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన జరిపారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, కార్యదర్శి రాజు నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పబ్లిక్ డిమాండ్

పూడిక తరలించండి

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లో జగన్నాథపురం గెడ్డ నుంచి తొలగించిన పూడికను రోడ్డు పక్కన కుప్పగా పడవేశారు. పది రోజులు గడిచినా తరలించలేదు. చెత్త నుంచి దుర్వాసన వస్తోంది. స్థానికులు, గెడ్డ అవతలకు వెళ్లే వారు, పార్కు, సాయిబాబా, వేంకటేశ్వర స్వామి ఆలయాలకు వెళ్లే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణం పూడిక తరలించేలా చర్యలు చేపట్టాలి.

– జి. మధుసూదన్, శ్రీనివాసనగర్



శ్రీనివాసనగర్‌లో రోడ్డు పక్కన వదిలేసిక పూడిక

శివనగర్ వీధుల్లో అంధకారం

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు శ్రీరాంనగర్ శివనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో పలు చోట్ల వరుసగా వీధి లైట్లు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా శ్మశానవాటిక ఉండటంతో ఆ రోడ్డులో చీకటిపడిందంటే నిర్మానుష్యంగా ఉంటోంది. కొన్ని చోట్ల ఒక రోజు వెలిగితే మరో రోజు వెలగవు. రాత్రిళ్లు అంధకారం వల్ల అటుగా ప్రయాణించే వారు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి లైట్లు సక్రమంగా వెలిగేలా చూడాలి.

– శ్రీను, శివనగర్



శివనగర్‌లో వెలగని వీధిలైటు

వీధిలైట్లు వెలిగించండి



గాంధీనగర్ వీధిలో వెలగని వీధిలైటు

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్‌లో కొన్ని రోజులుగా వీధిలైట్లు వెలగకపోవడంతో నివాసులు ఇబ్బందులు పడుతున్నారు. వీధిలో వరుసగా వీధిలైట్లు పనిచేయకపోవడంతో అంధకారంలో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి లైట్లు వెలిగించేలా చర్యలు చేపట్టాలి.

– వేణు, గాంధీనగర్

పేదలకు అండగా సీఎం జగన్



శ్రీనగర్‌లో దివ్యాంగురాలికి సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు



సీఎం జగన్ ఫొటోను చూసి చిరునవ్వు చిందుస్తున్న చిన్నారి

కంచరపాలెం: ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 54వ వార్డులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. కంచరపాలెం దుర్గానగర్, శ్రీనగర్, దేవేంద్రనగర్ సచివాలయాల పరిధిలో ఆయన పర్యటించి నివాసులను ఆప్యాయంగా పలకరించారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ అధికారం చేపట్టిన నాటి నుంచి పేదలకు అండగా సీఎం వైఎస్ జగన్ నిలిచారని కొనియాడారు. పాదయాత్రలో ఇచ్చిన హామీల మేరకు విద్య, వైద్యం, ఉపాధి ప్రతి పేదోడికి అందేలా పరిపాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చల్లా రజని, ఆయా వార్డుల కార్పొరేటర్లు, రాష్ట్ర నాయకులు, డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

మంచు మనోజ్‌కు బర్త్‌డే విషెస్



మంచు మనోజ్‌తో బాలుభార్గవ్

కంచరపాలెం: సినీ నటుడు, నిర్మాత మంచు మనోజ్ జన్మదిన వేడుకలు హైదరాబాద్ ఫిలింనగర్‌లోని ఆయన నివాసంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైజాగ్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ బాలుభార్గవ్ మంచు మనోజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వైజాగ్‌లో అభిమానులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ఆయనకు వివరించారు.

కలెక్టర్‌కు రెవెన్యూ ఉద్యోగుల సన్మానం

సీతంపేట: కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను విశాఖ రెవెన్యూ ఉద్యోగులు, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు త్రినాథ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ భవిత కేంద్రం వద్ద శనివారం నిర్వహించిన నిరామయ ఆరోగ్య బీమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇటీవల ఆయన ప్రారంభించిన సంజీవని నిధి–డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌లో ఉద్యోగులను భాగస్వామ్యం చేయడం, ఆ నిధితో దివ్యాంగులకు ఆరోగ్య బీమా కల్పించి, ఇటువంటి గొప్ప కార్యక్రమంలో పరోక్షంగా ఉద్యోగులను భాగస్వామ్యం చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్యామ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వర్మ, సెక్రటరీ సిహెచ్.రమేష్, ఈసీ మెంబర్స్ సుధాకర్, మహేష్, కలెక్టర్ ఏవో ఈశ్వరరావు పాల్గొన్నారు.



కలెక్టర్ మల్లికార్జునను సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

అలరించిన కర్ణాటక గాత్ర కచేరి



కీర్తనలు ఆలపిస్తున్న దుర్గా ప్రియదర్శిని

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శనివారం సాయంత్రం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరి ఆహుతులను అలరించింది. గుమ్ములూరి శారదా, సుబ్రహ్మణ్యం శిష్యురాలు ఐవటూరి దుర్గా ప్రియదర్శిని తన మధురమైన గానంతో రామదాస్, దీక్షితార్, పురందరదాస్, అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. వక్రతుండ మహాకాయ, స్వామినాథ, సరసముఖి, ననుబ్రోవమని చెప్పవే, హిరణ్మయీం లక్ష్మీ, ముద్దుగారే యశోద, పలుకే బంగారమాయెనే, దేవీ గౌరీ మాతంగి, వెంకటాచల నిలయం, గోవింద నామాలు పాడి భక్తులను ఆకట్టుకున్నారు. ఈమెకు సరస్వతుల పార్థివ వయొలిన్‌పై, ఏఎస్ఆర్ కౌండిన్య మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని ప్రియదర్శినిని సత్కరించి అభినందించారు.

అభివృద్ధి పనులకు ప్రణాళికలు

మురళీనగర్: అభివృద్ధి పనులు చేపట్టేందుకు అంచనాలు వేసినట్టు జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు తెలిపారు. 49వ వార్డులో పలు అభివృద్ధి పనుల నిమిత్తం వార్డు కార్యాలయంలో శనివారం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డులోని పలు పాంతాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు గురించి పెద్దల సహకారంతో యుద్ధప్రాతిపదికన ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. అనంతరం వార్డులోని పలు ప్రాంతాల్లో శంకరరావు పర్యటించి సమస్యలు పరిశీలించారు. మాణిక్యాంబ, రజక కాలనీలో శిథిలావస్థలో ఉన్న ఐరన్ వంతెన నిర్మాణానికి అంచనాలు రూపొందించారు. కార్యక్రమంలో డీఈ భరణికుమార్, ఏఈ అర్చన, వైఎస్సార్‌సీపీ నాయకులు బి.శంకర్, కె.మున్నా, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



శిథిలావస్థకు చేరిన వంతెనను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

రాణించిన యశ్వంత్, చంటి

విశాఖ స్పోర్ట్స్ : వీడీసీఏ డివిజన్ లీగ్‌లో భాగంగా మూడో డివిజన్‌లో జరిగిన పోటీల్లో యశ్వంత్, చంటి రాణించి జట్టుకు విజయాన్నందించారు. వైఎస్ఆర్ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో సోలో సీసీతో తలపడిన సిటీసీసీ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి 264 పరుగులకు ఆలౌటైంది. యశ్వంత్ (107)సెంచరీ నమోదు చేయగా వరుణ్ 77 పరుగులు చేశాడు. ప్రతిగా సోలోసీసీ 185 పరుగులకే ఆలౌటైంది. చంటి 44 పరుగులిచ్చి ఐదు వికెట్లు తీశాడు.

ఫైనల్స్‌కు ప్రసాద్, లోహిత్, దిగ్విజయ్‌లు

విశాఖ స్పోర్ట్స్: మెన్ యూత్ స్టేట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ బాంటమ్ వెయిట్ ఫైనల్ బౌట్‌లో అనంతపురానికి చెందిన వి.పవన్‌తో స్థానిక బాక్సర్ పి.ప్రసాద్ తలపడనున్నాడు. మినిమం వెయిట్‌లో ఎస్.తేజశ్వర్‌తో పి.వాసుదేవ పాత్రుడు ఫైనల్‌లో తలపడనున్నాడు. ఫ్లైవెయిట్ 48–51కేజీల్లో స్థానిక బాక్సర్ కె.లోహిత్‌తో చిత్తూరుకు చెందిన ఎం.మున్నా తలపడనున్నాడు. విశాఖలోని రైల్వే బాక్సింగ్ హాల్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో భాగంగా శనివారం పలు వెయిట్ కేటగిరిల్లో మెన్ సెమీస్ పోటీలు జరిగాయి. ఆదివారం జరిగే ఫైనల్‌లో ఫెదర్‌వెయిట్ 54–57కేజీల్లో స్థానిక బాక్సర్ బాలగణేష్‌తో శ్రీకాకుళానికి చెందిన వి.మధు తలపడనున్నాడు. లైట్‌వెయిట్ 57–60కేజీల్లో పి.దిగ్విజయ్‌తో నెల్లూరుకు చెందిన జె.వాసు తలపడనుండగా లైట్ వెల్టర్ 60–63.5 కేజీల వెయిట్‌లో ఆశిఫ్‌తో జె.భాను ప్రకాష్, వెల్టర్3.5–67కేజీల వెయిట్‌లో ఎన్.దిలీప్ కుమార్‌తో ఎన్.హర్షవర్ధన్ పోటీపడనున్నాడు. లైట్ మిడిల్ 67–71కేజీల వెయిట్‌లో బి.తృణతో వై.ప్రభువర్ధన్, మిడిల్ 71–75కేజీల వెయిట్‌లో ఎస్.మోహన్‌రావుతో ఎ.అశోక్‌కుమార్ తలపడనున్నాడు. లైట్ హెవీ వెయిట్‌లో కె.దుర్గాప్రసాద్‌తో ఆయూష్ పూర్తి, క్రూజియర్ వెయిట్‌లో కె.రామ్‌తో పి.దేవ్‌కుమార్ తలపడనున్నారు. ఆదివారం మెన్ ఫైనల్స్‌తో పాటు టోర్నీలో భాగంగా వుమెన్ బౌట్స్ నిర్వహించనున్నారు.


'మార్కెట్ విలువ పెంపుపై పునరాలోచించాలి'

మద్రిపాలెం: ఇప్పటికే భవన నిర్మాణ రంగం ఎన్నో సమస్యలతో సతమతమవుతోందని, దానికి తోడు కరోనా సమస్య, తదనంతర పరిణామాల వల్ల పరిస్థితులు మరింత జటిలమై నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయని క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ అధ్యక్షుడు వి.ధర్మేంధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 1 నుంచి భూములు, స్థలాల మార్కెట్ విలువలను పెంచే నిర్ణయం తీసుకుంటోందని, దీని వల్ల నిర్మాణ రంగంతోపాటు కొనుగోలుదారుడిపై భారం పడుతుందన్నారు. ఆయా కారణాలను పరిగణలోకి తీసుకుని పక్కన ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు మార్కెట్ విలువలను పెంచకుండా నిర్మాణ, రియల్ ఎస్టేట్ రంగాలకు ఊతం ఇస్తున్నాయన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం ప్రజల స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని తమకు సహకరించి ఈ ఏడాది భూములు, స్థలాలపై మార్కెట్ విలువల పెంపుదలను వాయిదా వేసి యథాస్థితిని కొనసాగించాలని ధర్మేంధర్ విజ్ఞప్తి చేశారు.

బాధ్యులపై చర్యలకు డిమాండ్

తాటిచెట్లపాలెం: ఇటీవల రైల్వే డాక్టర్ విజయ్‌కుమార్ ఇంటిపై దాడి చేసిన డాక్టర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విశాఖ దళిత యూనిటీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం డివిజనల్ రైల్వే హాస్పిటల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ తిరు అరుల్‌జ్యోతిని కలిసి వినతిపత్రం అందజేశారు. వీరి వేధింపుల వల్ల విజయ్‌కుమార్‌కు ఆరోగ్య సమస్యలు తలెత్తాయని, దీనికి రైల్వే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఫోరం ప్రతినిధులు కోరారు. ఎస్.సుధాకర్, హరిబాబు, ప్రసాద్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



మృతిచెందిన దుర్గాబాయ్

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో విద్యుత్ షాక్‌కు గురై ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. తాటిచెట్లపాలెం శ్రీనివాసనగర్‌లో నివసిస్తున్న పట్నాల దుర్గాబాయ్(49) శనివారం ఉదయం ఇంట్లో స్నానం చేసి తడి దుస్తులను గోడపై ఉన్న ఇనుప తీగపై ఆరవేసింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురైంది. వెంటనే ఆమె భర్త పట్నాల విష్ణుమూర్తి చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దుర్గాబాయ్ చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విష్ణుమూర్తి ఫిర్యాదు మేరకు మహిళా ఎస్ఐ గౌరి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్థల ఆక్రమణపై ఫిర్యాదు

మద్రిపాలెం: తమ భూమిని బర్మా కాందిశీకులు ఆక్రమించారని కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు నమోదైంది. బర్మాక్యాంప్ దరి కప్పరాడలో బర్మా కాందిశీకులు తమ స్థలాన్ని ఆక్రమించారని, అడిగితే తమ సెక్యూరిటీ గార్డులపై దౌర్జన్యం చేశారని జి.సాంబశివరావు అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో కేసు దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సీతంపేట: హైటెన్షన్ విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు కైలాపురం మెయిన్ రోడ్, దుర్గా కైలాస్‌నగర్, కస్తూరినగర్ 1, 2, మధుసూదన నగర్, గ్రామిక నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. కైలాసపురం మెయిన్ రోడ్, శాంతినగర్, ఎంఈఎస్ గేట్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ప్రజలకు మెరుగైన వసతులు



గ్రీన్ గార్డెన్స్‌లో కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు, బర్కత్ అలీ

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు పార్వతీనగర్ గ్రీన్ గార్డెన్స్ వద్ద రూ.12 లక్షలతో డ్రైనేజ్ గెడ్డ కల్వర్టు నిర్మాణానికి శనివారం కార్పొరేటర్ బర్కత్ అలీతో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాగు నీరు, రోడ్లు, పార్కులు, స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, బరియల్ గ్రౌండ్లు, హెల్త్ సెంటర్లు ఇలా అన్నింటికీ సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరించి మెరుగైన వసతులు కల్పిస్తోందన్నారు. ఈ పనుల్లో నిర్లక్ష్యం ఉండకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని తెలిపారు. కరోనా విపత్తు సమయంలో కాంట్రాక్టర్లు, వలస కూలీలు రాకపోవడంతో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని, రాబోయే ఆరు నెలల్లో అన్ని సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఆయా ప్రాంతాల్లో సమస్యలపై ప్రజల విజ్ఞప్తులకు ప్రాధాన్యమిచ్చి, వాటిని పరిష్కరించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని కె.కె.రాజు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి గుజ్జు వెంకటరెడ్డి, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి ఎం.సునీల్, ఏఈ ఉష, వార్డు నాయకులు షేక్ బాబ్జి, హనుమంతు, సుశీల, జయ, వెంకటరమణ, శాస్త్రి, బాబా, నాగు, మల్లిక్, కనకరాజు, పైడిరాజు, సూర్య, అబ్బాస్, రమణమ్మ, సుజాత, సంపత్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హార్బర్ ఆధునికీకరణకు సహకరించండి

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్‌ను రూ. 152 కోట్లతో ఆధునీకరించేందుకు రూపొందించిన సమగ్ర ప్రణాళిక అమలుకు సహకరించాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను నాయకులు కోరారు. శనివారం కలెక్టరేట్‌లో హార్బర్ హైలెవల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పోర్టు అధికారులు, మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు, మత్స్యకార సంఘాల నాయకులు వాసుపల్లి జానకీరామ్, బర్రె కొండబాబు, చింతపల్లి వీరన్న, దూడ పోలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునికీకరణకు టెండర్లు పిలిచామన్నారు. కొన్ని పనులు కూడా ప్రారంభించినట్లు తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

వలంటీర్ల సేవలు అభినందనీయం



సత్కారం పొందిన వలంటీర్లతో కార్పొరేటర్ ఆళ్ల లీలావతి

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో శనివారం 42వ వార్డులో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లను కార్పొరేటర్ ఆళ్ల లీలావతి ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రజలకు సారధులుగా వలంటీలు సేవలు అందించడం అభినందనీయమన్నారు. అనంతరం వలంటీర్లకు కార్పొరేటర్ శాలువా, ప్రసంశాపత్రాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లాత్ బ్యాగులతో పర్యావరణానికి మేలు

మురళీనగర్: పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ క్లాత్ బ్యాగులు వాడాలని సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ ప్రతినిధి ఐశ్వర్య పిలుపునిచ్చారు. మురళీనగర్ శాఖ గ్రంథాలయంలో శనివారం పిల్లలకు పర్యావరణ పరిరక్షణపై ఏపీ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చిత్రలేఖనం పోటీలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చని చెట్లను కాపాడుకునేందుకు ప్లాస్టిక్‌ను వాడకూడదన్నారు. కార్యక్రమంలో వనిత వాకర్స్ క్లబ్ ప్రతినిధి జి.శిరీష, గ్రంథాలయ అధికారి వై.పద్మజ పాల్గొన్నారు.



గీసిన చిత్రాలు ప్రదర్శిస్తున్న పిల్లలు

వ్యక్తిత్వ వికాసం అవసరం

మురళీనగర్: నేటి యువత మనుగడ సాధించాలంటే వ్యక్తిత్వ వికాసం అవసరమని వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి కె.ద్వారకానాథ్ అన్నారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో శనివారం ముగిసిన వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండు వేసవిలో పన్నీటిజల్లుగా ఈ శిక్షణ తరగతులు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిపుణుడు డబ్బీరు రోహిత్, ఎస్.వి.ఆర్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ద్వారకానాథ్

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను శనివారం ద్వారకా జోన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడు రాష్ట్రం కుడ్డాలూరు జిల్లా కిజూహర్ మెయిన్ రోడ్డుకు చెందిన వి.సురేష్, త్రిమూర్తి ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొస్తూ రామాటాకీస్ సమీపంలో సంచరిస్తున్నారు. అనుమానాస్పదంగా వారు కనిపించడంతో ద్వారకా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలుసుకున్నారు. వారి వద్ద నుంచి ఏడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని విచారిస్తున్నారు.